సాక్షి
కుమురం భీం

సోమవారం : 15 : జనవరి : 2024



అయోధ్య అక్షింతలు.. రామయ్య ఆశీస్సులు

8లో▸

అయోధ్య అక్షింతలతో ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు.

డైరీ ఆవిష్కరణ

కాగజ్‌నగర్‌టౌన్: పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ముద్రించిన డైరీని ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఆదివారం కాగజ్‌నగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలు పరిష్కరించడానికి సహకరించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గరిష్టం/కనిష్టం
31.0/16.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి పెరుగుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ సౌరవ్ బిశ్వాస్‌కు సన్మానం



సౌరవ్ బిశ్వాస్‌తో ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: సెంట్రల్ కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ సౌరవ్ బిశ్వాస్‌ను ఆదివారం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు సన్మానించారు. కాగజ్‌నగర్ మండలంలోని నజ్రుల్‌నగర్ గ్రామపంచాయతీ విలేజ్ నంబర్–2కు చెందిన సంజిత్ బిశ్వాస్ కుమారుడు సౌరవ్ బిశ్వాస్ సెంట్రల్ కస్టమ్స్‌లో ట్రైనింగ్ తీసుకుని మొదటిసారిగా కాగజ్‌నగర్‌కు వచ్చిన సందర్భంగా ఘనంగా సత్కరించారు. అభినందనలు తెలిపారు.

కనుల పండువగా గోదారంగనాథుల కల్యాణం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని కాపువాడ ఆర్‌ఆర్వో కాలనీలోగల లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కనుల పండువగా గోదారంగనాథుల కల్యాణం నిర్వహించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు–శివాని దంపతులు, మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఇందిరా మార్కెట్‌లోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేద పండితులు నిర్వహించిన గోదాదేవి కల్యాణోత్సవంలోనూ ఎమ్మెల్యే దంపతులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు ఎమ్మెల్యే దంపతులను శాలువాలతో సత్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'ఆదర్శ' విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి విష్ణువర్ధన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఆదివారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ అబ్దుల్ కలీల్, పీడీ తిరుపతితో కలిసి విష్ణువర్ధన్‌ను అభినందించారు. ఇటీవల ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–14 కబడ్డీ పోటీల్లో విష్ణువర్ధన్ ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 16నుంచి 18వ తేదీ వరకు జనగాంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు.

సైన్స్‌ఫెస్టివల్‌కు సిద్ధం కావాలి

ఆసిఫాబాద్‌రూరల్: సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొనే విద్యార్థులు సిద్ధం కావాలని జిల్లా విద్యాధికారి అశోక్ సూచించారు. ఆదివారం అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్–2023లో ఎంపికైన ఆరుగురు విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సైన్స్ టీచర్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. హర్యానాలోని ఫరీదాబాద్ క్యాంపులో ఈ నెల 17నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైన విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

లోకల్ చార్జీల పెంపునకు ఆటోల బంద్



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: ఆటో చార్జీల (లోకల్) పెంపునకు ఆదివారం స్థానిక ఆటో డ్రైవర్లు, యజమానులు బంద్ పాటించారు. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటోలను నిలిపివేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు తాజ్ మాట్లాడుతూ.. మహిళలకు ప్రభుత్వం బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో గిరాకీ తగ్గి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. లోకల్‌లో ఇక నుంచి రూ.60, పట్టణ శివారు ప్రాంతాలకు రూ.80 చార్జి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించి ఆటో డ్రైవర్లు, యజమానులకు సహకరించాలని కోరారు. ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.

భోగ భాగ్యాల భోగి

- సంక్రాంతి సంబరాలు ప్రారంభం
- రంగవల్లులతో నిండిన ముంగిళ్లు
- నేడు మకర సంక్రాంతి, రేపు కనుమ



సంక్రాంతి అంటేనే సందడి.. సంబురాలు.. ఇంటి నిండా బంధువులు.. ఊరి నిండా ఉత్సాహం. మూడురోజుల సంక్రాంతి సంబరాల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం భోగి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఏ వీధి చూసినా గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలు, ఆకర్షించే రంగవల్లులు కనిపించాయి. తెల్లవారుజాము నుంచే ఇళ్ల లోగిళ్లలో ముగ్గులువేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. భోగి మంటలు వేశారు. చిన్నారులకు భోగి పళ్లు పోశారు. ఆలయాల్లో గోదా రంగనాథుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు.

– ఆసిఫాబాద్‌అర్బన్

ఇదీ.. పండుగ ప్రత్యేకత

తెలుగు పండుగల్లో సంక్రాంతి విశిష్టమైనది. సంక్రాంతి అంటే సూర్యుడు మకర రాశిలోకి సంక్రమించడమే. దీనినే ఉత్తరాయణ పర్వకాలమంటారు. ఈరోజు ముఖ్యంగా నది, సముద్ర స్నానాలాచరించడం శ్రేష్ఠంగా భావిస్తారు. తిలాస్నానం ఆచరిస్తే పీడలు తొలగిపోతాయని నమ్మకం. చిన్నారులకు భోగి పండ్లు పోస్తే వారిపై ఉన్న దోషాలు తొలగిపోతాయని భావిస్తారు. ఈరోజు నువ్వులు, బెల్లం కలిపిన పిండి వంటలు భుజించడంతో శరీర ఉష్ణోగ్రతలు సమతుల్యంగా ఉంటాయని నమ్ముతారు. మహిళలంతా గౌరీదేవిని పూజిస్తారు. ముత్తైదువలకు నోములు ఇచ్చుకుంటారు. పురుషులు పిత్రు దేవతలకు తర్పణాలు అర్పించి వారి ఆశీర్వచనాన్ని పొందుతారు. మొదటిరోజు భోగి మంటలతో ప్రారంభమైన సంక్రాంతి పండుగ ఆద్యంతం సంబరమే. మొదటిరోజు సూర్యోదయానికి ముందే భోగి మంటలు వేస్తారు. ఆ తర్వాత బొమ్మల కొలువు ఉంటుంది. సాయంత్రం పిల్లలకు భోగి పండ్లు పోస్తారు. అసలు భోగి అంటేనే పిల్లల పండుగ. భోగి రోజున వేసే ముగ్గులకు ఓ ప్రత్యేకత ఉంది. రెండోరోజు (నేడు) మకర సంక్రాంతి, రేపు కనుమ పండుగలను జరుపుకొంటారు.

ఆనందాలకు ప్రతీక

సంక్రమణ మహాపర్వానికి ముందు రోజుకు ఓ ప్రాధాన్యత ఉంది. దీనికి భోగిపర్వం అని పేరు. వాస్తవానికి భోగి వేడుకంతా చిన్నారులదే. సంక్రాంతి రోజు అంతా సంప్రదాయ వస్త్రాలు ధరించడం ఒక ఆనవాయితీ. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రాంతి అని పిలుస్తారు. రెండోరోజు పొంగలి, పిండి వంటలు, పిత్రు దేవతలు, దేవతలకు ప్రత్యేక పూజలు చేస్తారు. కొందరు మూడోరోజు ముక్కనుమ రోజు మాంసాహారాన్ని తీసుకుంటారు. హరిదాసుల హరి కీర్తన, గంగిరెద్దుల ఆటలతో ఆద్యంతం ఆత్మీయతతో సంక్రాంతి పండుగ జరుపుకొంటారు. ఇంటిముందుకు వచ్చిన హరిదాసులకు బియ్యం, వస్త్రదానం చేయడం సంప్రదాయంగా కొనసాగిస్తారు. పండుగ రోజు వాయినాలు ఇచ్చిపుచ్చుకోవడం ఆనవాయితీ.

శాస్త్ర ప్రకారం జరుపుకోవాలి



సూర్యుడి గమనమే సంక్రాంతి. దక్షణాయం నుంచి ఉత్తరాయణానికి మార్పే సంక్రమణం. ప్రతీ నెలకు ఒక సంక్రమణం ఉంటుంది. కానీ.. మకరానికి సూర్యుడు వచ్చినప్పుడు ఉత్తరాయణ పుణ్య కాలమందు తిలాస్నానం ఈ పండుగ విశేషం. పొప్పలక్ష్మి పూజలతో మహిళలంతా ఉపాసించి సౌభాగ్యంతో ఒకరినొకరు వాయినాలు ఇచ్చుకోవడం సంప్రదాయం. సూర్యుడి గమన మార్పునకు రంగవల్లులు తీర్చిదిద్దడం పండుగ లక్ష్యం. చిన్నారులకు భోగి పండ్లు పోయడం ద్వారా ఆయురారోగ్యాలతో పాటు అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. పండుగను సంప్రదాయంగా మాత్రమే జరుపుకోవాలి.

– ఇందారపు మధుకర్‌శర్మ, ఆసిఫాబాద్

పేదల వైద్యానికి పెద్దపీట



ఆస్పత్రి వివరాలు తెలుసుకుంటున్న అధికారులు (ఫైల్)

- జిల్లాలో 72 పల్లె దవాఖానలు
- ఇటీవలే కేంద్రబృందం పర్యటన
- ఆస్పత్రుల్లో కనీస వసతులపై ఆరా
- ఎనిమిది ఆస్పత్రులకు నజరానా!

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నేషనల్ హెల్త్ మిషన్ కృషి చేస్తోంది. డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, ప్రోగ్రాం అధికారి వినోద్, నోడల్ అధికారి వెంకటేశ్, జిల్లా క్వాలిటీ అధికారి సాయిప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ హీనా ఆఫ్రీన్ నిరంతర పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా వైద్య సేవలందిస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను 2017లో ప్రారంభించారు. ఇందులో భాగంగానే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోగల పల్లె దవాఖానలపై కేంద్ర బృందం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. పల్లె దవాఖానల ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ వైద్యం సరిగా అందుతుందా?.. వైద్యులు, సిబ్బంది సమయపాలన ఎలా ఉంది?.. తదితర అంశాల గురించి బృందం సభ్యులు ఆరా తీస్తున్నారు. దవాఖానల్లో సౌకర్యాలతో పాటు రోగులకు సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా? లేదా? తెలుసుకుంటున్నారు. ఆస్పత్రి పనితీరు బాగుంటే అధికారులు సంతృప్తి చెంది దవాఖానల అభివృద్ధికి నజరానా ప్రకటించే అవకాశముంది.

జిల్లాలో దవాఖానల పరిశీలన

జిల్లా వ్యాప్తంగా 72 పల్లె దవాఖానలున్నాయి. ఇందులో అందుతున్న సేవలను తెలుసుకునేందుకు ఇటీవల కేంద్ర బృందం అధికారులు జిల్లాకు చేరుకున్నారు. ముందుగా లింగాపూర్ మండలంలోని చోర్‌పల్లి, జామ్ని (జైనూర్) ఆస్పత్రులను పరిశీలించారు. జిల్లాలో 2017లో దవాఖానలను ప్రారంభించారు. పల్లె దవాఖానల్లో ప్రతిరోజూ ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యసేవలందిస్తారు. ఆస్పత్రిలో వైద్యాధికారి, ఒక సీహెచ్‌వో, హెల్త్ అసిస్టెంట్, ఇద్దరు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు విధులు నిర్వర్తిస్తారు. ఆస్పత్రికి నిత్యం వచ్చే 40 మందికి ఓపీ ఉంటుంది. రోగులకు సరిపడా అన్ని రకాల మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉంచుతారు. మొత్తంగా 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు చేసే సౌకర్యం ఈ ఆస్పత్రిలో ఉంది.

అధికారులు పరిశీలించిన అంశాలు

ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలతో పాటు వైద్య సిబ్బంది పనితీరు, వారు రోగులకు అందిస్తున్న సేవలు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ముఖ్యంగా భవన నాణ్యత ప్రమాణాలు, పేషెంట్ల రికార్డులు, నాన్ కమ్యూనికేబుల్ పరిశీలన, మాతా శిశువుల సంరక్షణ పని తీరు, గర్భిణులకు సకాలంలో అందుతున్న టీకాలు, టీబీ, క్షయ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకున్నారు. అర్హత సాధించిన ఆస్పత్రులకు గ్రేడ్‌ల వారీగా నజరానా ప్రకటిస్తారు. ఎంపికైన ఆస్పత్రులకు వరుసగా మూడేళ్లపాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రోత్సాహకం అందిస్తారు. 90 మార్కులు వచ్చిన ఆస్పత్రికి 'ఏ' గ్రేడ్ కింద రూ.5లక్షలు, 80కి పైగా వస్తే 'బీ' గ్రేడ్ కింద రూ.3లక్షలు, 70కి పైగా వచ్చిన ఆస్పత్రికి 'సీ' గ్రేడ్ కింద రూ.లక్ష చొప్పున మంజూరు చేస్తారు.

పరిశీలనలో ఎనిమిది ఆస్పత్రులు

నజరానా ప్రకటించేందుకు జిల్లాలోని గుండాయిపేట్, సుర్దాపూర్, బోదస్‌పల్లి, అంకోడ, పాట్నాపూర్, బెండారా, చోర్‌పల్లి, జామ్ని ఆస్పత్రులను కేంద్ర బృందం పరిశీలించింది. ఈ నెల చివరి వరకు గోయగాం, రాస్‌పల్లి ఆస్పత్రులను కూడా పరిశీలించనున్నట్లు బృందం సభ్యులు పేర్కొంటున్నారు. ఎనిమిది ఆస్పత్రులకు కేంద్ర బృందం ఆమోదం ప్రకటించగానే నజరానా పొందనున్నాయి.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



కొండపల్లిలో కరపత్రం ఆవిష్కరిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి, లోడుపల్లి, అగర్‌గూడ, కమ్మర్‌గాం గ్రామాల్లో అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల సంరక్షణపై ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రం ఆవిష్కరించారు. అటవీ అధికారులు మాట్లాడుతూ.. పెద్దపులుల దాడుల్లో పశువులు మరణిస్తే అటవీశాఖ ఆధ్వర్యంలో తక్షణసాయంగా రూ.5వేలు అందజేస్తామని తెలిపారు. అనంతరం పశువుకు సంబంధించిన పరిహారం యజమానికి అందిస్తామని పేర్కొన్నారు. పెద్ద పులుల దాడుల్లో పశువులు మరణిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

వేటాడితే కఠిన చర్యలు

కౌటాల: వన్యప్రాణులను వేటాడినా, హాని కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ సిర్పూర్(టీ) రేంజ్ అధికారి పూర్ణచందర్ హెచ్చరించారు. ఆదివారం రేంజ్ పరిధిలోని చీలపెల్లి, లింబుగూడ, మాకిడి, మాలిని, ఇటిక్యాల పహాడ్, చింతకుంట, భూపాలపట్నం, కేశవపట్నం, జక్కాపూర్ గ్రామాల్లో అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. పులిదాడిలో పశువులు చనిపోతే పరిహారం చెల్లిస్తామని తెలిపారు. పులి కదలికలు, పశువులపై దాడి ఘటనలు జరిగితే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అటవీశాఖ బీట్ అధికారులు షేక్ షాహిద్, నరేశ్, ప్రభాకర్, అరవింద్, రమీనా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి అదనపు ఆదాయం



రద్దీగా ఆసిఫాబాద్ బస్టాండ్

ఆసిఫాబాద్: సంక్రాంతి పండుగ ఆర్టీసీకి కలిసొచ్చింది. పండుగ సందర్భంగా రెండురోజులుగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోకు భారీగా ఆదాయం పెరిగింది. డిపోలో 77 బస్సులుండగా పండుగ నేపథ్యంలో రద్దీ ఎక్కువైంది. సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్‌కు ఐదు ప్రత్యేక బస్సులు వేశారు. దీంతో పాటు రద్దీ ఉన్న రూట్లలోనూ బస్సులు నడిపారు. సాధారణ రోజుల్లో డిపో ఆదాయం రోజుకు సుమారు రూ.17 లక్షలు వస్తుండగా, రెండురోజులుగా రోజుకు రూ.3 లక్షల చొప్పున అదనంగా వస్తోంది. రెండురోజులుగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోకు రోజుకు రూ.20 లక్షల చొప్పున రెండు రోజుల్లో రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు డీఎం శ్రీధర్ తెలిపారు. భోగి పండుగను పురస్కరించుకుని ఆదివారం కూడా బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్
- డోర్‌పల్లిలో ఆటల పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ప్రవీణ్‌కుమార్

సిర్పూర్(టి): యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆదివారం మండలంలోని డోర్‌పల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా అంబేద్కర్ మెమోరియల్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దారుఢ్యం, మానసికోల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం క్రీడాకారులతో మాట్లాడి పోటీలు స్నేహపూర్వకంగా నిర్వహించుకోవాలని సూచించారు. బీఎస్పీ నాయకులు అర్షద్ హుస్సేన్, లెండుగురె శ్యామ్‌రావ్, జాడి శ్యామ్‌రావ్, రాజ్‌కుమార్, రాంప్రసాద్, అమ్మ శ్రీకాంత్, రజనీకాంత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ'ం పిలుస్తోంది!

- ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- జిల్లాలో రెండు మోడల్ స్కూళ్లు
- ఫిబ్రవరి 22వరకు దరఖాస్తు గడువు
- ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష



ఆసిఫాబాద్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల

ఆసిఫాబాద్‌రూరల్: ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. గ్రామీణ ప్రాంతంలో ప్రతిభావంతులైనా నిరుపేద విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో చదువుకునేందుకు ఇది చక్కని అవకాశం. జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్ (యూ) లో మోడల్ స్కూళ్లున్నాయి. కాగా, తల్లిదండ్రులు పిల్లలను ఈ పాఠశాలల్లో చదివించేందుకు ఉత్సాహం చూపుతారు. ఈ పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసుకున్న 15మంది విద్యార్థులు బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు ఎంపికయ్యారు. జిల్లాలోనే టాప్ ర్యాంకులు సాధిస్తూ నేషనల్ కం మెరిట్ స్కాలర్ షిప్, జేఈఈ మెయిన్స్ సీట్లు కైవసం చేసుకుంటున్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తు ఇలా..

ఆదర్శ పాఠశాలలో ప్రవేశం కోసం http//telanganams. cgg. gov.in లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు విద్యార్థి పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, బోనఫైడ్ అవసరముంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత దరఖాస్తు జిరాక్స్ కాపీతోపాటు కుల ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్ జిరాక్స్ ప్రతులు సంబంధిత మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు అందజేయాల్సి ఉంటుంది.

దరఖాస్తు గడువు ఫిబ్రవరి 22

ఆదర్శ పాఠశాలలో 6నుంచి 10వరకు ప్రవేశాల కోసం ఫిబ్రవరి 22లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ రుసుం ఓసీలకు రూ.100, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రూ.50 ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 1నుంచి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయి. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

పరీక్ష విధానం ఇలా..

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఐదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. తెలుగు, గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లిష్, సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఇస్తారు.

పాఠశాల ప్రత్యేకతలు

- 6నుంచి10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత బోధన.
- పక్కా భవనాలు, సరిపడా వసతులు.
- ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీ.
- సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు లైబ్రరీ సదుపాయం.
- నాణ్యమైన మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం.
- జాతీయ ఉపకార వేతనాల కోసం ప్రత్యేక శిక్షణ.
- పదో తరగతి విద్యార్థులకు ఎన్టీఎస్ఏకు ప్రత్యేక శిక్షణ తరగతులు.
- క్రీడల్లో శిక్షణ.

సీట్ల కేటాయింపు ఇలా..

జిల్లాలోని రెండు ఆదర్శ పాఠశాలల్లో ఆరోతరగతిలో 200 సీట్లు ఉన్నాయి. ఏడోతరగతి నుంచి పదో తరగతి వరకు 2022–23 విద్యాసంవత్సరంలో ప్రవేశం పొంది మధ్యలో వివిధ కారణాలతో మానేసినవారి స్థానంలో ప్రవేశాలు కల్పించనున్నారు. ప్రవేశాలు రోస్టర్ పద్ధతిన కల్పిస్తారు. ఒక్కో పాఠశాలలో ఆరోతరగతిలో 100సీట్లున్నాయి. ఎస్సీలకు–15, ఎస్టీలకు–6, బీసీలకు–29 (బీసీ ఏ–7, బీసీ బీ–10, బీసీ సీ–1, బీసీ డీ–7, బీసీ ఈ–4) సీట్లున్నాయి. ఓపెన్ కేటగిరిలో 50 సీట్లు భర్తీ చేయనున్నారు. అన్ని కేటగిరిల్లోనూ బాలికలకు 33శాతం సీట్లు కేటాయించనున్నారు.

లోకల్ విద్యార్థులకు ప్రాధాన్యం



ఆదర్శ పాఠశాలలో ఆరోతరగతి నుంచి పదోతరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆరో తరగతిలో 100 సీట్లు, 7నుంచి 10వ తరగతి వరకు ఎన్ని ఖాళీలుంటే అన్ని సీట్లు భర్తీ చేస్తాం. లోకల్ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తాం. లోకల్ వారు లేకుంటే ఇతర మండలాల విద్యార్థులకు అవకాశం ఉంటుంది.

– అబ్దుల్ కలీల్ ప్రిన్సిపాల్, ఆసిఫాబాద్

అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ జిజాబాయి

కౌటాల: మండలంలోని మొగడ్‌ధగడ్ గ్రామంలో ఆదివారం ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలను సర్పంచ్ జిజాబాయి ప్రారంభించారు. పోటీల్లో 80 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. పోటీలు రాత్రి, పగలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బొమ్మకంటి మనీశ్, ఉపసర్పంచ్ కల్పన, బీజేపీ మండలాధ్యక్షుడు వాసుపటేల్, బొమ్మకంటి మహేశ్, బండు, బాజీరావ్, భాస్కర్, విలాస్, ప్రవీణ్, మహేందర్, వసంత్, బిక్కు, ఉమేశ్, గణపతి, దశరథ్, ఛత్రపతి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా కోడి పందేలు


పట్టుబడిన కోళ్లతో పందెంరాయుళ్లు(ఫైల్)

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందెలు, జూదం ఆటలు పలు గ్రామపంచాయతీల శివారుల్లో జోరుగా సాగుతున్నాయి. మండలంలోని వెంకటాపూర్, కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లి, నాయకునిపేట, లింగాల గ్రామపంచాయతీ పరిధిల్లో కోడి పందెల జరుగుతున్నాయి. సంక్రాంతి పండుగ కావడంతో పందెంరాయుళ్ల గ్రామ శివారుల్లో నిర్వహిస్తుండగా కొంత మంది వాట్సాప్ గ్రూపుగా ఏర్పాటు చేసుకొని ఎక్కడెక్కడ పందెంలు జరుగుతున్నాయో వారికి సమాచారం తెలియజేస్తున్నారు. పలువురు నిర్వాహకులు, పోలీసులు దాడుల నుంచి తప్పించుకునేందుకు కొంత మంది యువకులను ఆ పొలిమేరళ్లో కాపలాగా పెట్టి ఆటలు సాగిస్తున్నారు. అటు వైపు అనుమానిత వ్యక్తులు, వాహనాలు వస్తే వెంటనే నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో అక్కడి నుంచి తప్పించుకుంటున్నారు. ఇదంతా పోలీసులకు తెలిసినప్పటికీ 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత శుక్రవారం కన్నెపల్లి సబ్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురు పందెంరాయుళ్లతో పాటు రెండు పందెం కోడిపుంజులను, రూ.3,600 నగదును పోలీసులు పట్టుకోవడం విధితమే. ఏదిఏమైనా ఈ పందెం ఆటల్లో సర్వం కోల్పోయి రోడ్డున పడే అవకాశం ఉన్నందున పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామశివారులో ఆదివారం సాయంత్రం కోడి పందేలు నిర్వహిస్తున్న ఆకుదారి శ్రీనివాస్, చింతం బాపులను ఆరెస్ట్ చేసి వారివద్ద పందెం కోళ్లతో పాటు రూ.1500 స్వాధీనపర్చుకున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా మండలంలో ఇదివరకు పందేలు నిర్వహించిన గ్రామాలపై నిఘా పెట్టినట్లు తెలిపారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బెపల్లిలో ఈ నెల 11వ తేదీన జరిగిన చోరీని పోలీసులు మూడు రోజుల్లో ఛేదించారు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం మేరకు... రాపల్లికి చెందిన గుండ ఐలయ్య 11వ తేదీన తన భార్య లక్ష్మితో కలిసి చేను పనుల్లో భాగంగా ఇంటికి, గేట్‌కు తాళం వేసి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటికి గేట్ తాళం తీసి ఇంట్లోకి వెళ్లే క్రమంలో ఇంటి తలుపు బెడెం విరగ్గొటి ఉంది. ఇంట్లో చూడగా బీరువాలోని రూ.70వేల నగదు, తులం బంగారు గొలుసు, 18 తులాల వెండి గొలుసులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న క్రమంలో పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన జెట్‌పాత్ పవన్ గుర్తించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌చేసినట్లు ఎస్సై తెలిపారు. మూడు రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులను రూరల్ సీఐ తోట సంజీవ్ అభినందించారు.





అయోధ్య అక్షింతలు.. రామయ్య ఆశీస్సులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శ్రీరామనామ జపం చేస్తోంది. అయోధ్య రాముడి పూజిత అక్షింతలు ఇంటింటికీ పంపిణీ జరుగతున్నాయి. జైశ్రీరాం.. రామలక్ష్మణ జానకీ.. అంటూ ఊరూవాడా, పల్లె, పట్నం అంతా కూడా కాషాయమయం అవుతుండగా శ్రీరామ పూజిత అక్షింతలతో శోభాయాత్రగా మేళతాళాలు, కోలాటాలు, చెక్కభజనలు, శ్రీరామ, హనుమ భజనలతో సాగుతూ ఇంటికీ చేరుతున్న అక్షింతలను మంగళహారతులతో స్వీకరిస్తున్నారు. శ్రీరామ అక్షింతల పంపిణీలో ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా అక్షింతల పంపిణీలో భాగస్వామ్యం అవుతున్నారు.

- హారతులతో స్వాగతం పలుకుతూ స్వీకరిస్తున్న భక్తులు
- 15వ తేదీ వరకు ఇంటింటా పంపిణీ పూర్తికి సన్నాహాలు
- అక్షింతలు, ఆలయ చిత్రపటం, విశేష కరపత్రం అందజేత
- శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ

తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో..
అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ఆలయ ప్రాణప్రతిష్ట 22వ తేదీన జరగనుంది. అయితే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అయోధ్యలో బాలరాముడి వద్ద పూజించిన అక్షింతల వితరణ శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టారు. మంచిర్యాల జిల్లాలో ఈ నెల 1వ తేదీన ఆరంభం కాగా 15వ తేదీ వరకు అక్షింతల పంపిణీ పూర్తి చేసేలా కార్యక్రమం సాగుతోంది. జిల్లాకు మొత్తంగా 35 క్వింటాళ్ల అక్షింతలు వచ్చాయి.

అక్షింతల వితరణ ఇలా..
సంచాలన సమితీ సభ్యులు ప్రతీరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు బృందంగా ఏర్పడి పంపిణీ చేస్తోంది. కలశ ప్రముఖ్ అక్షింతల కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని బృందంతో కలిసి ఇంటింటికీ వెళ్తున్నారు. పలువురు మంగళ హారతితో స్వాగతం పలుకుతూ అక్షింతలు స్వీకరిస్తున్నారు. అక్షింతలు, శ్రీరామజన్మభూమి మంది చిత్రపటం, ఆలయ విశేషాలు తెలిపే కరపత్రం అందజేస్తున్నారు. మంచిర్యాల జిల్లాకు వచ్చిన దాదాపు 13 క్వింటాళ్ల అక్షింతల్లో కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు కూడా పంపించారు. మంచిర్యాల జిల్లాలో సుమారు 3 లక్షల కుటుంబాలకు అక్షింతలు పంపిణీ చేయాలని సంకల్పించిన నేపథ్యంలో ఇప్పటి వరకు దాదాపు 1.80 లక్షల కుటుంబాలకు అక్షింతలు వితరణ చేసినట్లు శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సమయోజక్‌లు తెలియజేశారు.


శోభాయాత్రలో మహిళా భక్తులు


అక్షింతలు అందిస్తున్న సభ్యులు

ప్రాణప్రతిష్ట రోజున తలపై..
అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటా పంపిణీ జరుగుతున్నాయి. శ్రీరాముడి పూజిత అక్షింతలు ఈ నెల 22వ తేదీ శ్రీరామజన్మభూమి ఆలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ట రోజున ఇంటిల్లిపాది ఆ పూజిత అక్షింతలను తలపై వేసుకుని శ్రీరాముడి ఆశీర్వాదం పొందుతూ శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్టలో కూడా భాగస్వామ్యం అయినట్లుగా భావించాలని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తెలియజేస్తుంది.

భారీ శోభాయాత్ర..
జీవితంలో మళ్లీ చూడబోని శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజున మంచిర్యాల జిల్లా కేంద్రంలో భారీ శోభాయాత్ర తలపెట్టారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని హనుమాన్ విగ్రహం నుంచి ఆరంభమయ్యే శోభాయాత్ర వెంకటేశ్వర టాకీస్ మీదుగా గంగారెడ్డి రోడ్, విశ్వనాథాలయం, రైల్వేస్టేషన్ రోడ్, మార్కెట్ రోడ్‌ల మీదుగా జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానం వరకు సాగనుంది. ఇక్కడ పాల్గొనే భక్తజనులందరికీ శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన ప్రసాద పంపిణీ వితరణ చేయనున్నారు.

అక్షింతల రూపంలో శ్రీరాముడు..

నిర్మల్: జిల్లాలోనూ అయోధ్యలో పూజించిన అక్షింతల పంపిణీ ఇంటింటా సాగుతోంది. ప్రతి పల్లెకూ.. ప్రతి ఇల్లుకూ చేరుతున్నాయి. రామజన్మభూమి నుంచి పంపిన అక్షింతలను ఆహ్వానిస్తూ.. రాములోరే ఈ రూపంలో తమ ఇంటికి వచ్చినట్లుగా జిల్లావాసులు భావిస్తున్నారు. అయోధ్య నుంచి నేరుగా నిర్మల్ వచ్చిన అక్షింతలను స్థానిక బాగులవాడ సరస్వతి శిశుమందిర్ పక్కన గల రామాలయంలో ఉంచి, అక్కడి నుంచి జిల్లా మొత్తం పంపిస్తున్నారు. జిల్లాలోని విశ్వహిందూపరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్, హిందూవాహిని, స్థానిక యువజన, కాలనీ సంఘాలు, ఇతర ఆధ్యాత్మిక సంస్థలూ అయోధ్య అక్షింతల పంపిణీలో భాగమవుతున్నాయి.


మాజీ ఎంపీ నగేష్‌కు అక్షింతలు అందజేస్తున్న సభ్యులు

ఇలాంటి అవకాశం జన్మలో రాదు..



అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు పట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ పంచే అవకాశం జన్మలో రాదు. ఇది నిజంగా పూర్వజన్మ సుకృతమే. అక్షింతలు, రామమందిర ఫోటోలు, కరపత్రాలను ఇంటింటా అందిస్తూ ఉండగా ప్రతిఒక్కరూ పండుగ వాతావరణంలో మంగళహారతులతో స్వాగతిస్తూ తమకు నీళ్లారబోస్తూ అక్షింతలు స్వీకరిస్తూ ఉంటే శ్రీరాముడే ఈ అదృష్టం తమకు కలిగించినట్లు భావిస్తున్నాం. – మన్నవ శివపావని, సంచాలన సమితీ సభ్యురాలు

27 గ్రామాల్లో పంపిణీ పూర్తి చేశాం



ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో అయోధ్య బాలరాముడి అక్షంతలు పంపిణీ చేశాం. ఈ నెల 16 వరకు అక్షంతల పంపిణీ కొనసాగనుంది. అక్షంతలను పూజా గదిలో, తినే బియ్యంతో పాటు బీరువాలో భద్రపరుచుకోవాలి. వివాహాలు, శుభకార్యాలతో పాటు కొత్త పనులు ప్రారంభించే సమయంలో ఈ అక్షంతలు వినియోగించుకోవాలని పండితులు సూచిస్తున్నారు.జ
– ఇరుకుల్ల ఆంజనేయులు, రామజన్మభూమి తీర్థ ట్రస్ట్, మండల అధ్యక్షులు

గడపగడపకూ అక్షింతలు



ఆదిలాబాద్‌టౌన్: అయోధ్య శ్రీ రామజన్మ భూమి అక్షింతలను ఆదిలాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో గడప గడపకు వెళ్లి పంపిణీ చేయడం జరిగింది. జిల్లా అధికారులు, మందిరాలకు వెళ్లి అక్షింతలను అందించాం. కాలనీల్లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈనెల 1 నుంచి 15 వరకు అక్షింతల పంపిణీ కార్యక్రమం చేపట్టగా, 16 నుంచి 21వ తేది వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తాం. దుర్గావాహిని, విశ్వహిందూ పరిషత్, హిందూ వాహిని, బజరంగ్ దళ్ తదితర హిందూ ఉత్సవ సంఘాలు పాలుపంచుకున్నారు. – రేఖ రజని, దుర్గా వాహిని ప్రముఖ్, ఆదిలాబాద్

మహద్భాగ్యం..



జైశ్రీరాం.. దేశమంతా ఎదురుచూస్తున్న అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడి నుంచి వచ్చిన పూజిత అక్షింతలను అందుకోవడం మహాద్భాగ్యం. వీటిని ఇంటింటికే చేర్చే అదృష్టం దక్కడం చాలా ఆనందాన్నిస్తోంది.
–ముప్పిడి రవి, వీహెచ్‌పీ పట్టణాధ్యక్షుడు, నిర్మల్

రామయ్య వచ్చినట్లే..



అయోధ్యలో రామాలయ నిర్మాణానికి చేపట్టిన కరసేవకు వెళ్లే అదృష్టం దక్కింది. ఇప్పుడు అదే అయోధ్యలో పూజించిన అక్షింతలను పంపిణీ చేసే అదృష్టం రావడం సంతోషంగా ఉంది. స్వయంగా ఆ అయోధ్య రాముడే తమ ఇంటికి వచ్చాడన్నట్లుగా అక్షింతలను కళ్లకు అద్దుకుని ఇంట్లోకి తీసుకెళ్లి పూజిస్తున్నారు.
–మంచిరాల నాగభూషణ్, శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ జిల్లా కన్వీనర్, నిర్మల్

కూలిన ఆర్కే–5 గని పైకప్పు

- కార్మికుడికి గాయాలు

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఆర్కే–5 గని పైకప్పు ఆదివారం కూలింది. ఈ ఘటనలో జనరల్ మజ్దూర్ కార్మికుడు జోరుపుల నరేశ్ గాయపడ్డాడు. శనివారం నైట్ షిఫ్ట్ విధులకు హాజరైన నరేశ్ విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఆదివారం ఉదయం 4 గంటలకు గని 4 సీమ్ 21 ఆఫ్ లెవల్‌లో బ్లాస్టింగ్ చేశారు. తర్వాత డ్రెస్సింగ్ పనులు చేపట్టారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఫీటు వెడల్పు ఉన్న పైకప్పు కూలింది. అందులో కొంతభాగం నరేశ్‌పై వీపుపై పడడంతో గాయాలయ్యాయి. కదలేని స్థితిలో ఉన్న నరేశ్‌ను తోటి కార్మికులు హుటాహుటిన రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలిని గని అధికారులు, మైనింగ్ ఇన్‌స్పెక్టర్లు పరిశీలించారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్య ఆసుపత్రి వద్ద క్షతగాత్రుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు.


పరామర్శిస్తున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు













గంగాధర్‌కు సన్మానం


సన్మానిస్తున్న కౌన్సిలర్ భరత్

ఆదిలాబాద్‌టౌన్: నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకమైన కొండూరి గంగాధర్‌ను ఆదివారం సరస్వతినగర్ పంచముఖ హనుమాన్ రామాంజనేయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు సన్మానించారు. నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని పేర్కొన్నారు. నిర్మల్ మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మణిపూర్ కాలనీకి చెందిన యువకుడు హరీశ్ అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. కాలనీకి చెందిన స్నేహితులు హరీశ్, నిఖిల్‌లు ఈనెల 9న ఉజ్జయిని వెళ్లారు. తిరుగుప్రయాణంలో ఇంటికి వస్తుండగా ముత్ఖేడ్ వద్ద రైల్వేస్టేషన్‌లో అదృశ్యమయ్యాడిజీ. తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో కోడి పందేలు జరగకుండా ముందస్తుగా ఇద్దరిని బైండోవర్ చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ ఆదివారం తెలిపారు. పెద్దంపేటకు చెందిన తనుగుల రమేశ్, టీకానపల్లికి చెందిన గంగాధరి తిరుపతిలను బైండోవర్ చేసినట్లు తెలిపారు. మండలంలో కోడి పందేలు నిషేధించినట్లు తెలియజేస్తు కోడి పందేలు నిర్వహించినా, పాల్గొన్న చట్టపరమైన కేసులు తప్పవని ఎస్సై తెలిపారు.

ఎడ్లబండిని ఢీకొన్న బైక్

ఉట్నూర్‌రూరల్: ఎడ్లబండిని బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరి మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్ పాఠశాల సమీపంలో ఆదివారం రాత్రి ఈఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తగూడ కొలాంగూడ గ్రామానికి చెందిన టేకం చందు, టేకం నక్కుదాసు మండల కేంద్రంలో హమాలీగా పనిచేస్తున్నారు. ఆదివారం ఉట్నూర్ నుంచి బైక్‌పై గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని ఢీకొనడంతో చందు అక్కడికక్కడే మృతిచెందాడు.